# యంత్రనగరి సరిహద్దుల్లో!

అఫ్సర్

అదిగదిగో మా వూరు.

- లోలోపల నేను ఎక్కడో అణిచిపెట్టిన పసితనం ఆనందం పట్టలేక గంతులేసింది. మా వూరిని చూడగానే ఆ కంపార్టుమెంట్‌లో మిగతా ప్రయాణీకుల నుంచి నా ప్రపంచం వేరయింది. అయిదు నిమిషాల్లో మా వూరి ప్లాట్‌ఫారం వస్తుంది. అంత దూరాన కనిపిస్తున్నాయే, అవి కోట గోడలు. ఆ గోడమీద రెండు మూడు పాతకాలపు వీరఖడ్గాలున్నాయని బగ్గీతాత చెబ్తూండేవాడు.

ఊరు దగ్గిరవుతోంది.

నా గుండెల్లో మువ్వలు మ్రోగుతున్నాయి. నిరంతరం నగరారణ్యపు హోరులో, వ్యాపార ప్రపంచ ఇంద్ర మహేంద్ర జాలాల్లో క్షణంసేపు కూడా వూపిరాడని, నాకు, ఇప్పటికీ మావూరు గుర్తొస్తే చాలు, నామీంచి ఒక పచ్చపచ్చని గాలి అల అలా దూసుకుపోతుంది. ఆ కోట, ఆ పేర్ల చావిడి, ఆ చెరువుగట్టు వీటన్నిటికి మించి మా బగ్గీ తాతయ్య.

కంపార్టుమెంట్‌లో ప్రయాణీకుల గజిబిజి కబుర్లూ, పేకాట గుంపు నవ్వులూ, పిల్లల ఏడ్పులు... ఇవేవీ నాకు వినిపించడం లేదు. నాకు తెలీకుండానే నేను కలలాంటి నా పసితనపు వూహల్లోకి వూయలలూగుతూ వెళ్లిపోయాను.

"బాబూ, మీరిక్కడే దిగాలనుకుంటాను" అని పక్కనున్న వ్యక్తి గుర్తు చేసేదాకా మా ప్లాట్‌ఫారం వచ్చేసిందనీ, నేను దిగాలనీ నాకు స్ఫురించలేదు.

* * * * * * * * *

స్టేషన్‌లోంచి బయటపడ్డాను. అక్కణ్నించి మా వూరికి వెళ్లాలంటే అయిదారు కిలోమీటర్లు నడవాలి. నా లెక్కప్రకారం ఇక్కడే ఎక్కడో ఒక చెట్టు కింద బగ్గీ తాతయ్య వుండాలి. ఎవరో ఓ ప్రయాణీకుడు వెళ్లి నిద్రలేపితే లేచి దర్జాగా బండి కడుతూ వుండాలి. బగ్గీ తాతకోసం అటూ ఇటూ చూస్తున్న నన్ను ఇందాక నా పక్కనే వున్న ప్రయాణీకుడు మళ్లీ పలకరించాడు.

"సిరిపురానికి ఇప్పుడు బస్సు పడిందయ్యా బాబుగారూ, ఒక పావుగంట ఆగారంటే బస్సొస్తుంది" అనేసి వెళ్లిపోయాడు, నేను 'బగ్గీ తాత' కోసం చూస్తున్నానని చెప్పేలోగానే.

రెండడుగులు ముందుకు వేశానో లేదో వెనక నుంచి "బండి కావాలా బాబూ" అని దీనంగా ఓ కంఠం అడిగింది.

నేను పెదవి విప్పి మాట్లాడేలోగానే అతను నాముందు వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. అతని తల బాగా నెరిసిపోయి వుంది, శరీరం ముడతలు తేరింది. తల పాగా మాసిపోయివుంది. అతని కళ్లల్లో చిన్నపాటి కాంతి కూడా లేదు. అతన్ని ఎప్పుడో చూసిన జ్ఞాపకం! కాని గుర్తుకు రావడం లేదు.


"రూపాయిస్తే చాలు బాబూ" ఆ కంఠం అప్పుడప్పుడే గుర్తొస్తోంది, కాని గుర్తొచ్చి రాకుండా.

కొద్ది దూరంలో వున్న చెట్టువైపు చూశాను. అక్కడ బగ్గీతాత బండి వుంది. ఒకడుగు ముందుకు వేశాను, అతను నా వెనకే వచ్చాడు. ఇలా అడుగుతూన్న ఈ వ్యక్తి బగ్గీతాత కాదు కదా!

"బాబూ..." అని వెనకనుంచి మళ్లీ.

నేను వెనక్కి తిరిగి, అతని కళ్లల్లోకి తీక్షణంగా చూశాను. అలా చూసేసరికి అతని పేదకళ్లు బెదిరిపోయాయి. ఒకడుగు వెనక్కి వేశాడు.

"తాతా..." అని నేను అప్రయత్నంగా అనేశాను. ముడుతలుపడిన అతని చేతుల్ని నా చేతుల్లోకి తీసుకుని- "నేను తాతా, నన్ను గుర్తుపట్టలేదా" అన్నాను.



అతను ముసలికళ్లు చికిలించి- లేదన్నట్టు తలూపాడు.

"పద..." అని నేను బండివైపు అడుగువేశాను.

అప్పుడతని సంతోషానికి అంతులేదు. మెరుస్తూన్న కళ్లతో అడుగు కదిపేడు. బండి ఎక్కేముందు- ఒక్కసారి ఆ గుర్రంవైపూ, బగ్గీవైపూ, తాతవైపూ చూశాను. నా కళ్లకి ఆ మూడూ ఒక్కలాగే కనిపించాయి. వృద్ధాప్యం ఆవహించిన సన్నజీవాలు, రంగు మాసిన బగ్గీ.

బగ్గీ ముందుకు సాగింది. అప్పుడు అడిగేడు బగ్గీతాత

"బాబూ మీ పేరేంటన్నారు..."

"ఇంకేమీ అనలేదు, అయినా ఈ వూరొచ్చి పదేళ్లపైనయింది. ఇప్పుడు నా పేరు చెప్పినా గుర్తుకు తెచ్చుకోలేవేమో!"

బగ్గీతాత వెనక్కి తిరిగి నా కళ్లల్లోకి చాలాసేపు చూశాడు. అతని కళ్లల్లో మెరుపు మెరిసినట్టయింది.

"మీరు ప్రసాదు బాబూ దోస్తులా" అన్నాడు.

"బ్రహ్మాండంగా గుర్తుపట్టావే..." అన్నాన్నేను ఆశ్చర్యంతో తలమునకలవుతూ.

"ఇదేమిటి తాతా, నువ్వు నా దగ్గిరకొచ్చి 'భిక్షాందేహీ' అన్నట్టు బండి కట్టాలా అని అడగడం...."

"ప్చ్... రోజులు మారిపోయాయి బాబూ, మోటరొచ్చింది, నాకు మెతుకు ల్లేకుండా చేసింది. ఒకోరోజు...." అని ఆగిపోయాడు. "ఆ... ఇవన్నీ ఎందుకులే బాబూ, అసలు నాకు తెలీకడుగుతామూ, పదేళ్లబట్టి ఈ వూరూ ఈ ధ్యాసా పట్టకుండా ఎట్లావున్నావూ," అడిగేడు.

అలాంటి ప్రశ్న పుట్టేంత తీరిక కూడా ఏనాడూ దొరకని నేను ఒక్కసారిగా బగ్గీతాత అడిగిన ప్రశ్నకు ఏ సమాధానం చెప్పాలి? బగ్గీతాత 'మోటర్'తో పోరాడుతున్నట్టే నేనూ

యాంత్రికమైన జీవితంతో వుక్కిరిబిక్కిరవుతున్న వాణ్ణే.

"అవును, తాతా, నాకే ఆశ్చర్యంగా వుంది. పదేళ్లు ఎలా గడిచిపోయాయా అని, కాని ఆ రోజులే వేరు, తలుచుకుంటే బాధ తప్ప ఆనందం మిగలదు. ఇన్ని బస్సులూ, మోటార్లులేని మా చిన్నప్పుడు ఎంత ప్రశాంతంగా వుండేది. ఇప్పుడు బాధ్యతలనీ, హోదాలనీ ఏవో బరువుల్ని భుజమ్మీద మోపుకొని అదే జీవితమన్న భ్రమలో గడిపేస్తున్నాం. కానీ ఆ చిన్నప్పుడు ఏమీ తెలియని వయసులో బగ్గీ తాత చెప్పిన కథలేవీ, చెరువుగట్టున బగ్గీ తాత పాడిన పాటలేవీ, ఆడించిన ఆటలేవీ?" అన్నాను గతస్మృతిని నెమరేసుకుంటూ.

ఉన్నట్టుండి బండి ఆగిపోయింది. తలెత్తి చూశాను. తాత కళ్లల్లోంచి రెండు కన్నీటిబొట్లు తళుక్కున మెరిసి నేలరాలాయి.

* * * * * * * * *

పిడికెడు మెతుకుల కోసం 'మోటర్'తో యుద్ధం చేస్తున్నాడు బగ్గీతాత. బహుశా మోటర్ చెడిపోయి మూలనపడాలని అతను రోజూ దేవుడికి పూజలు చేస్తుండొచ్చు. మోటర్ ఏ చెరువులోనో బోల్తాపడిపోవాలని కోరుకున్నా ఆశ్చర్యంలేదు. కాని నేను- నా చుట్టూ అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్న ఆ నగరం... ఒక్కొక్క మనిషి ఒక యంత్రంగా మారుతున్న ఆ నాగరికత....!

ఒక్కసారి నా వర్తమానంలోకి అడుగుపెడితే, నాకు కనిపించేదీ వినిపించేదీ ఏముంది? ఆ బండిచప్పుడు ఎక్కడో దూరంగా, సుదూరంగా లీలా మాత్రంగా వినిపిస్తూ వుంటుంది, కనుచూపు మేరా ఎక్కడా పిసరంత పచ్చదనం కనిపించదు. పాముల్లా మెలితిరిగే రహదారులమీద బారులు తీరిన కార్లు, బస్సులు, ప్రవాహంలా బిరబిరా సాగిపోతున్న జనసముద్రం....!

ఇన్ని యంత్రాల్లో నేనూ ఒక యంత్రాన్నే పొద్దున్నేలేచి అద్దం ముందు నిలబడి గడ్డం గీసుకుంటాను, బ్రష్ చేసుకుంటాను, షవర్ కింద నిలబడి స్నానంచేస్తాను, ఒంటిమీద నలగని మల్లెపూవులాంటి తెల్ల చొక్కా వేసుకుంటాను, గొంతును నొక్కీ నొక్కకుండా వేలాడే 'టై' కట్టుకుంటాను, ఎడం చేత్తో నా హోదాకి గుర్తుగా కోటు వేలాడతీసుకుంటాను. మా ఆవిడ ప్రేమగా అందిచ్చిన టిఫిన్నూ, కాఫీ హడావుడిగా పూర్తి చేస్తానో లేదో-

"సాబ్..." అంటూ గేటుదగ్గిర కారు డ్రైవర్.

రెండు చేతులా ఫైళ్లు పెట్టుకుని నా వెనక అటెండర్ నడిచి వస్తాడు. అప్పటి నుంచి రాత్రి ఏ ఎనిమిదింటికో ఇంటికి చేరేదాకా ఫైళ్ల సమాధిలో వుక్కిరిబిక్కిరవుతాను.



## శ్యామ్ బెనెగల్ కు నెహ్రూ అవార్డు!

ప్రముఖ సినీదర్శకుడు శ్రీ శ్యామ్ బెనెగల్ కు ఈ ఏడాది ప్రతిష్ఠాకరమైన 'సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు' లభించింది.

1964లో ఏర్పాటైన ఈ అవార్డు క్రింద 20 వేల రూపాయల నగదును బహూకరిస్తారు.

ఈ అవార్డు పొందినవారు రెండు వారాలపాటు సోవియట్ యూనియన్ లో పర్యటించేందుకు అవకాశముంటుంది.

ప్రముఖనటి దేవికారాణీ, చరిత్రకారుడు శ్రీ ఎస్. గోపాల్ లకు కూడా ఈ అవార్డు లభించింది.

ప్రతి ఏడాది ఈ అవార్డును నాలుగు తరగతులుగా బహూకరిస్తూ వుంటారు.

క్యాటగిరి 'బి'లో ఈ అవార్డును పొందిన వారిలో ప్రముఖ జర్నలిస్టు శ్రీ వి.కె. మహదేవన్ కుట్టి, ఉర్దూ కవి శ్రీ జగన్నాథ్ అజాద్, జాతీయ మ్యూజియం డైరెక్టర్ జనరల్ శ్రీ ఎల్.పి. సిహోరేలు వున్నారు. ఈ అవార్డు క్రింద వీరికి 10 వేల రూపాయలు బహూకరిస్తారు.

హిందికవి శ్రీ అరుణ్ కమల్ కు 8 వేల రూపాయల నగదు బహుమతి అందించ బడుతుంది.

ప్రఖ్యాత నృత్య కళాకారులు శ్రీ నరేంద్రశర్మ, డాక్టర్ డి.వై. సంపత్ కుమార్, ప్రముఖ కవులు ఎస్.డి. సంతాని (సింధీ), నిరంజన్ ఉజ్ గారే (మరాఠీ), రతన్ చక్రవర్తి, మలెకాంతి బసు (బెంగాలీ), యం. కామరాజులు (తమిళ), శివ ప్రసాద్ కోస్తా (హిందీ), హరికిషన్ కౌల్ (కాశ్మీర్), డా. కబీర్, అహ్మద్ జైసీ (ఉర్దూ)లకు అయిదువేల రూపాయలు, ప్రశంసా పత్రం ఈ అవార్డు క్రింద లభిస్తాయి.

ఫైళ్లు, సంతకాలు, బిజినెస్ లెటర్స్ డిక్టేట్ చేయడం- ఇంతే జీవితం! రాత్రి ఇంటికి రాగానే పిల్లలు- 'హెలో డాడీ' అని రెండు బుగ్గలమీదా రెండు ముద్దులిచ్చి, వాళ్లవాళ్ల గదుల్లోకి వెళ్లిపోతారు. ఆ తర్వాత మా ఆవిడ వచ్చి నాకోసం కొత్త నిఘంటువు తెరుస్తుంది. ఆమె వొంటిమీదకూడా అప్పడప్పుడూ నాకు ఫైళ్లవాసనే తాకుతుంది....!

* * * * * *

"బాబూ... ఇక దిగండి" అని బండి ఆపేడు తాత. గత జ్ఞాపకాల హోరులోనే వూరొచ్చేసింది.

"ఇదే చావిడి" అని ఒకవైపు వేలు చూపించాడు.

"అదా చావిడి?" అన్నాన్నేను నమ్మలేకుండా- ఆ విశాలమైన పీర్ల చావిడిమీద ఇప్పుడు వరసగా అయిదారు కొట్లు వెలిశాయి. నా చిన్నప్పుడు మోటారు సైకిల్ని చూస్తేనే చుట్టూ మూగేజనం ఇప్పుడక్కడ కార్లు తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు.

నేను బండిదిగానో లేదో ప్రసాద్ ఎదురయ్యాడు.

"ఒరే, నువ్వు బగ్గీలో వచ్చావా? నేను బస్సుకోసం చూస్తున్నా" అన్నాడు ఆశ్చర్యంగా.

"బగ్గీ తాత వుండగా మోటరెందుకు?" అంటూనే ఓ యాభైతీసి బగ్గీతాత చేతుల్లో పెట్టబోయాను.

"వద్దుబాబూ..." అంటూ చేతులు వెనక్కి ముడుచుకున్నాడు తాత.

"ఫర్లేదు తాతా" అంటూ యాభైనోటు అతని చిరిగిన జేబుల్లో కుక్కాను.

"నా దగ్గిర అంత చిల్లరలేదు బాబూ" అని ప్రసాద్ వైపు తిరిగేడు.

"చిల్లరొద్దు, నువ్వు సాయంత్రం ఒకసారి కలువు" అని మేమిద్దరం ముందుకు కదిలాం. మా వైపు అలాగే చూస్తూ నిలబడిపోయాడు తాత.

* * * * * * *

"ఇవ్వాళ బగ్గీతాత పండగ చేసుకుంటాడు" అన్నాడు ప్రసాద్ ఇంటిగేటు వెనక్కి నెడుతూ.

"ఎందుకలా? బగ్గీతాతకి ఈ యాభై ఓలెక్కా?" అన్నాను.

"చూస్తాండు- వాడికి రూపాయి నోటు కళ్లబడని రోజులు కూడా వున్నాయి."

"అదేం? తాత కూడా ఇందాక ఏదో చెప్పబోయాడు, కాని చెప్పలా"

"బగ్గీతాత పరిస్థితి ఇదివరకటిలా లేదు. ఇప్పుడు మనిషి బాగా కటకటలో పడిపోయేడు. మన వూరు కూడా బస్తీకి ఏం తీసిపోదు, బస్సులొచ్చాయి, మిల్లులొచ్చాయి, జనాలకు పనులు పెరిగాయి, బస్తీకి వెళ్లాలంటే ఇదివరకు బగ్గీయే దిక్కు. ఇప్పుడు గంటకూ, అరగంటకూ బస్సుంది."

"సరే, తాతకెలా గడుస్తుంది?"

"ఎలాగేముంది? ఏదో ఓ రెండుమూడు రూపాయలు దక్కుతాయి. ఎవరూ అతన్ని పట్టించుకోరు. వారానికోసారి నేనే ఇంటికి తీసుకొచ్చి కడుపుకింత పెడ్తాను."

"దరిద్రంగా వుండే- ఎంత దర్జాగా బతికేడు బగ్గీతాత" అన్నాను.

"అవును, ఆ రోజుల్లో బగ్గీ తాతంటే జనాలకు పెద్దమోజు. ప్రతి ఇంట్లో వాడు ఆపద్బాంధవుడిలా ప్రత్యక్షమయ్యేవాడు. ఎర్రఏగానీ అడక్కుండా వాడు బండి తోలేవాడు, అదీగాక ఎంత నమ్మకంగా వుండేవాడు!" అన్నాడు ప్రసాద్.

నా చిన్నప్పటి రోజులు గుర్తొచ్చాయి నాకు- పెద్దవాళ్లకు బగ్గీతాత పెద్ద సెహోదారు, చిన్న పిల్లల్లో అతనే అందరికన్నా చిన్నవాడు. ఎవరికి ఏ ఆపద వచ్చినా తాతని కలవరించే వాళ్లు. అలాంటి బగ్గీతాత....!

* * * * * *

ఆ సాయంత్రం శుభ్రంగా స్నానాలు చేసి, చెరువుగట్టుకు వెళ్లాం మేమిద్దరం. ప్రసాద్ ఏమిటో మాట్లాడుతున్నాడు. కాని ఆ పరిసరాల్ని చూస్తూంటే నాకు బగ్గీతాత తప్ప మరేమీ కనిపించడంలేదు. నేనేమీ మాట్లాడలేకపోతున్నాను.

"ఏం, మాట్లాడవేం?" అన్నాడు ప్రసాద్ మాటల మధ్యలో.

"ఆ... చెప్పు, వింటున్నా" అన్నాను. నిజానికి నేను వినడంలేదు కాని అతనేం చెబుతున్నాడో తెలుస్తూనే వుంది. ట్రాక్టర్ కొనడం, పెంకుటిల్లు డాబాగా రిపేర్ చేయించడం, పెద్దమ్మాయికి కూడబెడ్తున్న కట్నం డబ్బు, నడిమి అబ్బాయి కాలేజీ చదువు... నాకు అవేవీ వినిపించడం లేదు, నా చిన్నప్పటి రంగు రంగుల గుర్రబ్బగ్గీ, తాత పాడిన పాటలు, ఆడించిన ఆటలు... ఈ చెరువు గట్టునే కదా, ఆ చల్లని వెన్నెల రాత్రులు... కథలు కథలుగా బగ్గీతాత చెప్పిన అనుభవాలు....!

ఆ సాయంత్రం, ఆ రాత్రి నాకు భారంగా గడిచింది. బగ్గీతాత గురించి తప్ప మరో విషయం ఆలోచించలేకపోతున్నాను. రాత్రి నిద్రపోయేటప్పుడు పోస్ట్ మాస్టర్ ఇంటి నుంచి కబురొచ్చింది, ఫోన్ వచ్చిందట.

నేనూ, ప్రసాద్ వెళ్లాం. నా పి.ఎ. ఫోన్ చేశాడు. అర్జెంటుగా సంతకాలు పెట్టాల్సిన ఫైల్సు వున్నాయట. రేపొద్దుట తను బయలుదేరి వస్తున్నాననీ-

"వద్దు వద్దు, నేనే వస్తాను" అని ఫోన్ పెట్టేశాను.

* * * * * *

తెల్లారే లేచి నేను ప్రయాణానికి సిద్ధమయ్యాను.

## యంత్రనగరి సరిహద్దుల్లో...

"ఇవ్వాళ వుండరాదా అంకుల్" అని ప్రసాద్ పిల్లలు బతిమాలారు. ప్రసాదూ, అతని భార్య కూడా చాలాసేపు చెప్పి చూశారు.

"పిలుపడదు ప్రసాద్, నా పి.ఎ. సాధారణంగా ఫోన్ చేయదు" అన్నాను. ప్రసాద్ బయటికి వెళ్లి, ఎవరిదో స్కూటర్ తీసుకు వచ్చాడు.

అయిదు నిమిషాల్లో మేం రోడ్డుమీదికి చేరుకున్నాం.

పి.ఎ. ఎందుకు ఫోన్‌చేశాడో అన్న ఆలోచన ఏ మూలనో వేధిస్తున్నా, నన్ను బగ్గీతాత స్మృతులే వెంటాడుతున్నాయి.

రోడ్డుమీద అల్లంత దూరాన బస్సు నిలబడివుంది.

"బస్సు ఇక్కడెందుకు ఆపాడో!" అన్నాను నా వెనక కూర్చున్న ప్రసాద్‌తో.

"ఏముంది, అడుగడుగునా జనం ఆపుతూనే వుంటారు" అన్నాడు ప్రసాద్.

బస్సు దగ్గిర బాగా రద్దీగా వుంది. కానీ అది తొక్కిసలాట లాటిదేమీకాదు.

మేం కొద్దిదూరం వెళ్లేసరికి- అటుగా వెళ్తున్న ఎవరో ప్రసాద్‌కి కేకేసి చెప్పారు.

"యాక్సిడెంట్ అయింది"-

- స్కూటర్ కొంచెం స్లో చేశాను నేను. బస్సు దగ్గిరయింది. ప్రసాద్ ఆపమన్నాడు. నాకురెండోసారికి గానీ ప్రసాద్ మాట వినిపించలేదు.

"ఆపరా, ఒకసారి, చూద్దాం," అన్నాడు ప్రసాద్ మళ్లీ.

"ఏముంటుంది, యాక్సిడెంట్ అంటే.." గొణుగుతూ ఆపాన్నేను.

"ఏముంది. వెధవ, తాగి బండి తోలి వుంటాడు" ఎవరో ఓ వ్యక్తి ప్రసాద్ వైపు నడిచివస్తూ అన్నాడు.

మేం స్కూటర్ దిగి జనాన్ని నెట్టుకుంటూ ముందుకు వెళ్లాం.

నెత్తుటిమడుగులో బగ్గీతాత!

నేను క్షణంసేపు స్థాణువైపోయాను. కళ్లముందు మసకతెరలు కమ్మాయి, మెదడంతా ఖాళీ అయిపోయింది.

ఒక గుంపు పొలాల వైపు చూస్తోంది, ఆ పొలాల్లో ముక్కలుముక్కలైన బగ్గీ. రంగురంగుల నా చిన్నప్పటి బగ్గీ నెత్తుటిరంగు పులుముకొని ముక్కలుముక్కలై కనిపిస్తోంది.

అంత గందరగోళంలోనూ నా గడియారం కీచుమన్న చప్పుడు నాకు వినిపించింది. ప్రసాద్‌వైపు చూశాను. ప్రసాద్ ఆ నెత్తుటి మడుగు చూడలేక, మరోవైపు చూపు మరల్చుకుని నిలబడ్డాడు.

మేమిద్దరం గుంపులోంచి బయటపడ్డాం. నాకు ఇంకా పది నిమిషాల వ్యవధి మాత్రమే వుంది. తొరగా వెళ్లాలి. ప్రసాద్ నా వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. నా కళ్లల్లో గడిబిడిని ప్రసాద్ గుర్తుపట్టాడు.

గడియారం నన్ను వెంటాడుతోంది. ఒక్కక్షణం కూడా అక్కడ నిలబడే అవకాశం లేదు.

"సరే, నువ్వెళ్లు. నేను సాయంత్రం వచ్చి స్కూటర్ తీసుకుంటా" అన్నాడు ప్రసాద్.

నేను స్కూటర్ స్టార్ట్‌చేసి, వెనక్కి చూశాను.

ప్రసాద్ నావైపే చూస్తున్నాడు. నేను ఇంకోసారి అతని వైపు చూడలేక, స్కూటర్ ముందుకు పోనిచ్చాను.

- ముక్కలైన ఆ బగ్గీ... నా ఆలోచనల్లో ఒక మహానిశ్శబ్దం!

- ఒక క్షణం బగ్గీతాత స్థానంలో జీవచ్ఛవంలా పడివున్న నేను- యంత్రంలా- నిశ్చలనంగా. ●